# ప్రేమ జీవితం

**మా** స్నేహితుడికొకడికి ప్రేమ పుట్టింది. లేక లేక పుట్టిన ఈ ప్రేమను చూసుకుని వాడు తెగ మురిసిపోసాగాడు. స్నేహితులమైన మా అందరికీ తన ప్రేమను ప్రదర్శించి, దాని గుణగణాలు తెగ పొగడసాగాడు.

ఎంత చెడ్డా స్నేహితులం గనక ఇంత అందమైన ప్రేమ కలిగినందుకు మేం వాణ్ని అభినందించి, ప్రేమను యథోచితంగా ఆశీర్వదించాం.

నిజానికి మాలో కొందరికి ఈ ప్రేమ అంత అందమయిందిగా కనిపించలేదు. అప్పుడే పుట్టిన ప్రేమ ఎంత అందంగా ఉంటుంది గనక? దానికి ఏడవటం తప్ప ఏమీ చాతకాదు. మాటలా రావు. ఏడవనప్పుడు కళ్లు మూసుకు పడుకుంటుంది. ప్రపంచ జ్ఞానమా, శూన్యం.

దీనికెన్ని గండాలు గడవాలో. ఎంత పోషణ చెయ్యాలో!

ప్రేమ పుట్టగానే సరా! దాన్ని పెంచుకు రావటంలో ఎంతో ఉంది?

అయితే ఆ వివేకం అనేకమంది తల్లులకుండదు. వాళ్లు పిల్లల్ని కనటమే ఒక మహత్కార్యమనీ, ఆ పని చేసిన తరవాత వాళ్లకేమీ బాధ్యత లేదనీ, బిడ్డ వన్నె చిన్నెలన్నీ తనంతట తానే సంపాయిస్తుందనీ, దానికేమన్నా ప్రమాదం కలిగితే ఆ తప్పు భగవంతుడిదనీ భావించినట్టు ప్రవరిస్తారు.

ప్రేమ పుట్టిన మా స్నేహితుడిట్లాగే ప్రవర్తించసాగాడు. తన ప్రేమ చూసుకుని మురవటంలో కొంతకాలం వ్యర్థం చేశాడు. దానికి హరించుకోలేనంత ఆహారం ఇచ్చి దాని ఆరోగ్యం చెడగొట్టాడు. అది పోరు పెట్టి ఏడుస్తుంటే ఏదో చికిత్స చెయ్యటానికి బదులు, దమ్మిడీ అంత మొహం చేసుకుని దిగులుపడి అడ్డమైన వాళ్ల సలహా తీసుకుని అందరి సలహా కూడా ఒక్కసారే ఆచరణలో పెట్టి ప్రేమను మరింత పాడుచేసుకున్నాడు.

వాడి ప్రేమ ఒళ్లు చెయ్యలేదు, నవ్వలేదు, కేరింతలు పెట్టలేదు, బోర్ల పడలేదు, పాకలేదు.

సాటి స్నేహితుడి ప్రేమ ఇటువంటి దుస్థితిలో ఉండటం చూసి కొంతమంది స్నేహితులు వాణ్ని గట్టిగా కోప్పడి, ప్రేమను పెంచే సక్రమ విధానాలు నేర్పారు.

మా స్నేహితుడి ప్రేమ కాస్త కోలుకుని, చేతులూ కాళ్లూ ఆడించి నలుగుర్నీ చూసి నవ్వటమూ, "ఊ" "ఆ" అనటమూ నేర్చింది.

మళ్లీ పారవశ్యం పైగమ్మి మావాడు జ్ఞానం కోల్పోయినాడు. ప్రేమ పాకాడటం నేర్చుకునే రోజుల్లోనే పరిగెత్తించటానికి ప్రయత్నించాడు. అది తొక్కు మాటలు మాట్లాడుతుంటే దానివెంట తనుకూడా ఆ మాటలే మాట్లాడి తనుకూడా ఒక శిశువైపోయినాడు. కాలం గడిచినకొద్దీ ప్రేమకు అతి ప్రేమ చూపించి, జాస్తిగా లాలన చేసి, మకురుతనం నేర్పి నానా భ్రష్టుగా పెంచాడు.

ఎడంగా ఉండి చూసేవాళ్లకు వాడు తన ప్రేమ ద్వారా ఎక్కువ సుఖం అనుభవిస్తున్నదీ, కష్టం అనుభవిస్తున్నదీ కూడా తెలీదు. ప్రేమ పుట్టినందుకు వాణ్ని అభినందించిన వాళ్లమందరమూ విచారించవలసిన అవసరం కలిగింది.

కాని వాడికీ వాడి ప్రేమకూ మధ్య అడ్డం వెళ్లటానికి మాకెవరికీ గుండె చాలలేదు. వాడికి పుట్టిన ప్రేమ వాణ్ని వొట్టి శుంఠను చేసి ఎట్లా పడితే అట్లా ఆడిస్తుంటే దానికెవరు బాధ్యులు?

ఈ స్థితిలో, మా స్నేహితుడికి ప్రేమ పుట్టిన వార్త కాస్తా పెద్దలకు తెలిసింది. ఈ సంగతి తెలియగానే పెద్దలకు కోపం వచ్చింది. ఈ ప్రేమ సక్రమంగా పుట్టినది కాదన్నారు పెద్దలు. దీన్ని తక్షణం వెలివెయ్యాలన్నారు.

పెద్దలు చెప్పింది కాదనటానికి వీల్లేదు. వీలుంటే వాళ్లు పెద్దలేకారు! వాళ్లతో వాదించి లాభంలేదు. వాళ్లకు వాదన ఏమిటో తెలీదు.

అయినా మేం వదిలి పెట్టలేదు.

"ఏదో దారి తప్పి, వాడికి, పాపం, లేక లేక ప్రేమ పుట్టింది. చూసి చూడనట్టు పోనివ్వండి" అన్నాం పెద్దలతో.

"అట్లా ప్రేమ పుట్టటానికి వీల్లేదు. మా ఎదట ఇటువంటిది జరగటానికి వీల్లేదు!" అన్నారు పెద్దలు.

"తీరు పుట్టిన తరువాత ఏం చేస్తారు? మీలో ఎవరికీ ఎన్నడూ ప్రేమ పుట్టలేదా?" అన్నాం.

"పుడితే దాన్ని వెంటనే హతామార్చేశాం! అంతేకాని ఇట్లా చాటునా మాటునా పెంచామా?" అన్నారు పెద్దలు.

అదీ నిజమే మరీ!

"ఇంకొక స్వల్ప విషయం కూడా గమనించండి!" అన్నాం పెద్దలతో. "వీడికి పుట్టిన ఈ ప్రేమ ఎట్లాగో భ్రష్టాకారిదైపోయింది. దాన్ని సరిగా పట్టుకురావటం మావాడికి

చాతకాలేదు. ఇటువంటి భ్రష్టాకారి ప్రేమ మీద మీ వంటి పెద్దలు చెయ్యి చేసుకోవటం యోగ్యమైన పని కాదు."

ఈ మాటలు విని మావాడు మండిపడ్డాడు.

"నాకు పుట్టిన ప్రేమను అడ్డమైనవాళ్లూ ఇటువంటి మాటలంటే నేనూరుకోను. నేను దాన్ని ఎంతో ఆదర్శప్రాయంగా పెంచాను. నా ప్రేమే నాకు పంచప్రాణాలున్నూ. ప్రపంచంలో అదివరకెంతమందికి ప్రేమ పుట్టినా నాకు పుట్టిన ప్రేమతో ఏ మూలా సరిపోదు. నా ప్రేమనే అపేక్షిస్తున్నారుగా?" అన్నాడు మావాడు.

ఆ ముక్కతో పెద్దల ఆగ్రహం మరింత జాస్తి అయింది.

వాళ్లు మావాడి ప్రేమను కాస్తా బలాత్కారంగా లాక్కుపోయి ఎక్కడో వదిలేశారు. అది వికృతరూపంతో నానామూలలా తిరిగి అతి దౌర్భాగ్యమైన బతుకు బతికి చివరకు ఐపులేకుండా పోయింది.

ఇప్పుడు మావాడు తనకెన్నడూ ప్రేమ కలగనట్టే నటిస్తాడు. ఎవరికన్నా ప్రేమ పుట్టిందంటే మొహం చిట్లించుకుంటాడు – అది సక్రమంగా పుట్టిన ప్రేమ అయినా సరే!

***ముద్రణ : చిత్రగుప్త, 1 నవంబర్ 1942***